

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



జిల్లాకు వర్షసూచన

రాగల ఐదు రోజులూ ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు 2 నుంచి 25 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు.

గరిష్టం/కనిష్టం

34.3°/21.8°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

15 నుంచి గ్రామ సభలు నిర్వహించాలి



గ్రామ సభల నిర్వహణపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: పీ–4 సర్వేలో ఎంపికైన బంగారు కుటుంబాలను మరోసారి పరిశీలించేందుకు ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకూ గ్రామసభలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పీ–4 కార్యక్రమంపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ సభల్లో ఇప్పటికే ఎంపికైన బంగారు కుటుంబాలను పరిశీలించి అర్హులైన వారిని తుది జాబితాలో చేర్చడంతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించాలన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో విజయవాడ నుంచి వచ్చిన అబ్జర్వర్ తమ్మిశెట్టి సాయి సాత్విక్, సీపీఓ విజయ్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హల్కూరుకు అరుదైన అవకాశం

- ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన కింద ఎంపిక

ప్రశాంతి నిలయం: షెడ్యూల్డ్ కులాల వారు ఎక్కువగా ఉన్న గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజనకు అమరాపురం మండలంలోని హల్కూరు గ్రామం ఎంపికైందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హల్కూరు గ్రామ అభివృద్ధి ప్రణాళిక ఆమోదం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ... ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన కింద ఎంపికైన హల్కూరుకు కేంద్రం రూ.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. వీటితో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసి ఇంతకు ఐదురెట్లు పనులు చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతుందన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అంగన్‌వాడీ భవన నిర్మాణం, ఆర్వో వాటర్ ప్లాంట్, ఎస్సీ కాలనీలో కరెంట్ స్తంభాల ఏర్పాటు, ఎస్‌హెచ్‌జీ రిసోర్స్ సెంటర్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, జిల్లా కన్వీనర్ శివరంగ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎల్డీఎం రమణకుమార్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల బాహాబాహీ

- సహకార సంఘం అధ్యక్ష పదవి కోసం రగడ
- పార్టీ కార్యాలయంలోనే సవిత, బీకే వర్గాల ముష్టి యుద్ధం



గోరంట్ల: టీడీపీ నేతలు ముష్టి యుద్ధానికి దిగారు. గౌనివారిపల్లి సహకార సంఘం అధ్యక్ష పదవి కోసం రెండు వర్గాలుగా విడిపోయి పార్టీ కార్యాలయంలోనే బాహాబాహీకి దిగారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది.

ఏం జరిగిందంటే...

గౌనివారిపల్లి సహకార సంఘం అధ్యక్ష పదవి కోసం హిందూపురం ఎంపీ పార్థసారథి, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వర్గాల మధ్య పోటీ నెలకొంది. ఎవరికి వారు తమకే పదవి కావాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో మంగళవారం పార్టీ కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో సహకార సంఘం అధ్యక్ష పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడానికి పార్టీ కార్యాలయంలో గౌనివారిపల్లి, కొండాపురం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ పార్థసారథి వర్గం నుంచి గౌనివారిపల్లి పంచాయతీకి చెందిన వడ్డే రవి, మంత్రి సవిత వర్గం నుంచి కొండాపురం పంచాయతీకి చెందిన కృష్ణమూర్తి అధ్యక్ష పదవికోసం పట్టుబట్టారు. ఇరువురికీ సర్దిచెప్పేందుకు మండల నాయకులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరగడంతో ఇరు వర్గాల నాయకులు పార్టీ కార్యాలయంలోనే ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకుని ముష్టి యుద్ధానికి దిగారు. ఈ ఘటనలో పార్టీ కన్వీనర్‌కు గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో గౌనివారిపల్లి సహకార సంఘం అధ్యక్ష ఎంపిక మరోసారి వాయిదా పడింది.



80,109

జిల్లాలో రక్తపోటు బాధితులు

60,639

జిల్లాలో మధుమేహ బాధితులు

రక్త పోటు..

చక్కెరతో చేటు

- **ధ**ర్మవరానికి చెందిన 32 ఏళ్ల సచివాలయ ఉద్యోగి ఇటీవల జ్వరంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మధుమేహం (షుగర్) వచ్చిందని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. అయితే తమ ఇంట్లో ఎవరికీ షుగర్ లేదని, అయినా ఇంత చిన్న వయసుకే తనకు ఎలా వస్తుందని వైద్యులతో వాదనకు దిగాడు. మరోచోట పరీక్షించుకున్నా ఫలితంలో మార్పులేక పోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.
- **హిం**దూపురం పట్టణానికి చెందిన 37 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగికి వారం రోజుల పాటు నిరంతరంగా తలనొప్పి రావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రి కెళ్లి చికిత్స చేయించుకున్నాడు. రక్తపోటు అధికమైందని వైద్యులు చెప్పారు. ఒకే విషయాన్ని పదే పదే ఆలోచించడం.. ఆహారపు అలవాట్లలో తేడా కారణంగా బీపీ పెరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. మసాలా, కారం, ఉప్పు తగ్గించాలని సూచించారు.

మారిన జీవన శైలితో జబ్బుల బారిన జనం

- 30 ఏళ్లకే బీపీ బారిన పడుతున్న వైనం
- ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్న మధుమేహం
- బద్ధకంతో అనారోగ్యం బారిన యువత
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

సాక్షి, పుట్టపర్తి

మారిన ఆహార అలవాట్లు, జీవన శైలి మనిషిని జబ్బుల బారిన పడేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన ఉద్యోగాలతో చాలా మంది చిన్న వయస్సులోనే రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నలుగురు కలిస్తే అందులో ఇద్దరికి బీపీ, మధుమేహం ఉంటోంది. ఇక వయసు మీద పడే కొద్దీ రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

మూడు పదుల వయస్సులోనే...

మారిన జీవనశైలి కారణంగా మూడు పదుల వయసులోనే.. బీపీ, షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య కూడా రోజురోజుకూ రెట్టింపు అవుతోంది. ఇక తీవ్ర ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారు చాలా మందే ఉన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి రంగంలోనూ పోటీ పెరిగింది. ఫలితంగా ప్రతి ఒక్కరూ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే సమయానికి ఆహారం తీసుకోకపోవడం.. ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడటం తదితర కారణాలతో లేని పోని రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. అయితే తాము బీపీ, షుగర్ బాధితులమని సగం మందికి తెలియకపోవడం గమనార్హం. ఏదైనా అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వెళ్తే.. ఉన్నఫలంగా ఈ రెండూ బయటపడుతున్నాయి. ఆ తర్వాత పదే పదే ఆరోగ్యం గురించి ఆలోచించడంతో మరిన్ని రోగాలు వెంటాడుతున్నాయి. వయసు మీరిన తర్వాత రావాల్సిన రోగాలు.. సగం వయసులోనే సోకుతుండటంతో జీవితం ఒక్కసారిగా తలకిందులవుతోంది.

చిన్న వయసులోనే ఆస్పత్రుల చుట్టూ..

పుట్టుకతోనే ఆస్పత్రులు చూడాల్సిన కాలంలో బతుకుతున్న సమాజంలో.. డాక్టర్ల చుట్టూ తిరగడం నిరంతర ప్రక్రియగా మారింది. చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిన వెంటనే ఏదో రోగం వెంటాడుతోంది. మానసిక ఒత్తిళ్లతో బీపీ, షుగర్ వెంటనే పలకరిస్తున్నాయి. కంప్యూటర్ కాలంలో నిత్యం బిజీబిజీగా గడిపే వారంతా రోజులో గంటసేపు కూడా శారీరక వ్యాయామం గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎక్కువ మంది మధుమేహం బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఏదో రోగం సోకిన తర్వాత క్రమం తప్పకుండా వ్యాయామం చేసినా పెద్దగా ఫలితం ఉండటం లేదు.

పట్టణాల్లోనే అధికం

రక్తపోటు, మధుమేహం బాధితుల సంఖ్యను ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. గ్రామాల కంటే పట్టణాలోనే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆహారపు అలవాట్లతో పాటు ప్రతి ఒక్కరూ శారీరకంగా శ్రమిస్తారు. అలాగే మసాలా, ఫాస్ట్ ఫుడ్ అందుబాటులో ఉండవు. సమయానికి తింటూ నిత్యం ఏదో పనిలో ఉంటారు. అయితే పట్టణ ప్రజలు నిత్యం బిజీగా ఉండటంతో పాటు సమయానికి భోజనం తినరు. శారీరక వ్యాయామం చేయరు. పైగా పిజ్జాలు, ఫాస్ట్‌ఫుడ్, మసాల ఆహారానికి అలవాటు పడుతున్నారు. దీంతో చిన్న వయసులోనే బీపీ, షుగర్ రోగాల బారిన పడుతున్నారు. ఈక్రమంలో బీపీ, మధుమేహం మందుల విక్రయాలు కూడా భారీగా పెరుగుతున్నాయి.



నియంత్రణే శ్రీరామరక్ష

ప్రతి మనిషికీ ఆరోగ్యమే ప్రధానం. ఆరోగ్యం బాగుంటే కుటుంబంలో అందరూ ప్రశాంతంగా ఉంటారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే రోగాల బారిన పడకుండా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లు బాగుంటే రోగాలు దరి చేరవు. శారీరక శ్రమ అవసరం. సోమరితనంతో లేనిపోని రోగాలు రావడం ఖాయం. ముందస్తు నియంత్రణ మార్గాలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష.

– డాక్టర్ ఫైరోజాబేగం, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

వైఎస్సార్ సీపీ నుంచి పలువురి సస్పెండ్

చిలమత్తూరు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిని వైఎస్సార్ సీపీ నుంచి ఆ పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. సస్పెండ్ అయిన వారిలో హిందూపురం 17వ వార్డు కౌన్సిలర్ వై.మాజీన్, 31వ వార్డు కౌన్సిలర్ పీసీ చిన్నమ్మ, టౌన్ బ్లాక్ కన్వీనర్ సీఎస్‌పీ నాగరాజు, హిందూపురం మున్సిపాలిటీకి చెందిన హబీబ్ ఉన్నారు. వీరిపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో విచారణ జరిపి క్రమశిక్షణా కమిటీ సిఫార్సు మేరకు సస్పెండ్ చేస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

- ప్రభుత్వాన్ని హెచ్చరించిన పెన్షనర్ల సంఘం
- కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం



ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో గోకులం నుంచి కలెక్టరేట్ వరకు పెన్షనర్లు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగార్జున శెట్టి మాట్లాడుతూ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పెన్షనర్లకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్‌తో పాటు పెన్షన్ వ్యాలిడేషన్ అమిడ్‌మెంట్ బిల్లును రద్దు చేయాలన్నారు. కేంద్రం 8వ పే కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. ఆస్పత్రుల్లో హెల్త్ కార్డుపై నగదు రహిత సేవలు అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్మారెడ్డి, జేఏసీ చైర్మన్ లింగా రామ్మోహన్, పెనుకొండ, హిందూపురం, మడకశిర, కదిరి, ధర్మవరం యూనియన్ కార్యవర్గ సభ్యులు, జిల్లా నలుమూల నుంచి తరలివచ్చిన పెన్షనర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీ ప్రభుత్వ పెన్షనర్లు

నా జోలికొస్తే అంతు చూస్తా

- 'సాక్షి' విలేకరికి టీడీపీ నేత బెదిరింపులు
- చిలమత్తూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు

చిలమత్తూరు: తన అవినీతి అక్రమాలను బయటపెడుతున్న సాక్షి విలేకరిపై ఓ టీడీపీ నేత రెచ్చిపోయాడు. 'నా జోలికొస్తే ఊరుకోను... నీ అంతు చూస్తా జాగ్రత్త' అంటూ బెదిరింపులకు దిగాడు. హిందూపురం నియోజకవర్గంలో ఏడాది కాలం పరిస్థితులపై ఈనెల 13న ''హిందూపురం.. అభివృద్ధి శూన్యం' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనంలోనే చిలమత్తూరులో జరిగిన నాసిరకం రహదారి పనులు... ఆ పనుల పరిస్థితిని తెలిపే చిత్రాలను సైతం ప్రచురించింది. దీంతో సదరు రహదారి పనులు చేసిన టీడీపీ నేత నాగరాజు యాదవ్ సాక్షి విలేకరిపై కక్షగట్టాడు. మంగళవారం విలేకరి శ్రీధర్‌రెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడాడు. తనను గెలుక్కుంటే అంతు చూస్తానంటూ బెదిరింపులకు దిగాడు. వార్తలు రాస్తే చంపేస్తారా...అని ప్రశ్నిస్తే... నువ్వు అలాంటి రాతలు రాస్తే అదే జరుగుతుందంటూ భయపెట్టాడు.



చిలమత్తూరు పీఎస్‌లో టీడీపీ నేతపై ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

నాగరాజు యాదవ్‌పై చర్యలు తీసుకోండి

సాక్షి విలేకరిపై టీడీపీ నేత నాగరాజు యాదవ్ గూండాగిరీని చిలమత్తూరు పాత్రికేయ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. నేతల అరాచకాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగుతారా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమన్నారు. సదరు టీడీపీ నేత నాగరాజు యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ మునీర్ అహ్మద్‌ను జర్నలిస్టులు కోరారు.

దాడులు, బెదిరింపులు సరికాదు

రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి విలేకరులపై, పత్రికా కార్యాలయాలపై కూటమి నేతలు చేస్తున్న దాడులు ప్రజాస్వామ్యానికి హాని కలిగించేలా ఉన్నాయని జర్నలిస్టు నేతలు ఆంజనేయులు, నరసింహారెడ్డి మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి నియంతృత్వ పాలన మునుపెన్నడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు ప్రత్యేకమైన స్థానం ఉందని, అలాంటి కలంపై దౌర్జన్యాలు సహించబోమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆంజనేయులు, శంకర్, సురేష్‌రెడ్డి, పవన్, నరసింహారెడ్డి, విశ్వనాథ్, వనం శ్రీనివాస రెడ్డి, నారాయణస్వామి, నాగార్జున, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామిక ఎన్నికను బహిష్కరిస్తున్నాం



విలేకరులతో మాట్లాడుతున్న ఈరలక్కప్ప,వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

- మడకశిరలో అంబేడ్కర్ రాజ్యాంగానికి టీడీపీ తిలోదకాలు
- పార్టీకి ద్రోహం చేసిన కౌన్సిలర్లకు ప్రజా కోర్టులో శిక్ష తప్పదు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, కౌన్సిలర్లు

మడకశిర: అప్రజాస్వామికంగా బుధవారం నిర్వహిస్తున్న మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వైఎస్సార్ సీపీ బహిష్కరిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, పలువురు కౌన్సిలర్లు స్పష్టం చేశారు. నగర పంచాయతీ ఎన్నికలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ రాజ్యాంగానికి తిలోదకాలిచ్చారని వారు ఆరోపించారు. మంగళవారం ఈరలక్కప్ప పట్టణంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల సమావేశమై ఎన్నికపై చర్చించారు. టీడీపీ అరాచక పాలన, అనుసరిస్తున్న అప్రజాస్వామ్య చర్యలకు వ్యతిరేకంగా ఎన్నికను బహిష్కరించాలని నిర్ణయించారు. అనంతరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, జయరాజ్, శ్రీనివాసులు, అంజన్‌కుమార్ యాదవ్, అన్సర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్‌తో కలిసి ఈరలక్కప్ప విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను టీడీపీ నాయకులు అడ్డదారుల్లో గెలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఏమాత్రం బలం లేకపోయినా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అడ్డదారుల్లో ఎన్నికలో గెలవడం చేతగాని వారి పని అన్నారు. టీడీపీ నాయకులకు దమ్ము, ధైర్యం, సత్తా ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలని సవాల్ విసిరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీనరసమ్మను, బీసీ సామాజిక వర్గానికి చెందిన రామచంద్రారెడ్డిని పదవుల నుంచి దించిన టీడీపీ... దళితులు, బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు.

ప్రజలు వారిని క్షమించరు

పార్టీ మారి తల్లి లాంటి వైఎస్సార్ సీపీకి ద్రోహం చేసిన కౌన్సిలర్లను తాము క్షమించినా ప్రజలు క్షమించరని ఈరలక్కప్ప అన్నారు. పార్టీ ఫిరాయించిన వారెవరూ వచ్చే ఎన్నికల్లో గెలవలేరన్నారు. వారికి రాజకీయ సమాధి తప్పదన్నారు. ఈ ఎన్నిక తర్వాత పార్టీ మారిన కౌన్సిలర్లకు కూటమి నాయకులు గౌరవం ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు. వారంతా పార్టీ మారి తప్పు చేశామని కుమిలిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజల్ని కోరుతామన్నారు. అంతేకాకుండా పార్టీకి ద్రోహం చేసిన కౌన్సిలర్లను పార్టీ నుంచి బహిష్కరిస్తామన్నారు.

మడకశిర పీఠానికి నేడు ఎన్నిక

- చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై కన్నేసిన టీడీపీ
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో అరాచకం
- ప్రలోభాలతో ఇప్పటికే పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు పచ్చకండువా
- ఎన్నికకు దూరంగా వైఎస్సార్ సీపీ

మడకశిర: అధికారం ఉంది.. ఇక తమకు అడ్డేముందన్నట్లుగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. కుట్రలు, కుతంత్రాలతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను పీఠాల నుంచి కూలదోస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారు. ఈ క్రమంలోనే మడకశిర నగర పంచాయతీ పీఠంపై కన్నేసిన టీడీపీ నేతలు కేవలం 5 స్థానాలతో విజయం సాధించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి వారిని పదవీచ్యుతులను చేసిన పచ్చ నేతలు బుధవారం జరిగే ఎన్నికలో తమవారిని పీఠాలపై కొలువుదీర్చేందుకు సిద్ధమయ్యారు.

ఉదయం 11 గంటలకు ఎన్నిక

మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నిక నిర్వహించనుంది. ఈ మేరకు ఈనెల 12న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులంతా సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఆహ్వానాలు పంపారు. అలాగే ఎన్నిక అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్‌ను ఈసీ నియమించింది.

టీడీపీకి 5 స్థానాలే

నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులుండగా... గత మున్సిపల్ ఎన్నికల్లో 15 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. టీడీపీ కేవలం ఐదుగురు స్థానాలను మాత్రమే నిలబెట్టుకోగలిగింది. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన లక్ష్మీనరసమ్మ చైర్‌పర్సన్‌గా, రామచంద్రారెడ్డి వైస్ చైర్మన్‌గా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే... నగర పంచాయతీపై టీడీపీ నేతలు కన్నేశారు. మెజార్టీ లేకపోయినా ఎలాగైనా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని కుట్రలు చేశారు. ఈ క్రమంలోనే కొందరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను భయపెట్టి, పలు రకాలుగా ప్రలోభాలకు గురి చేశారు. దీంతో 9 మంది కౌన్సిలర్లు టీడీపీ కండువా వేసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టి విజయం సాధించారు. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు కోల్పోగా.. మడకశిర నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది.



మడకశిర నగర పంచాయతీ కార్యాలయం

పదవులపై ఉత్కంఠ

చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు బుధవారం ఎన్నిక జరుగనుండడంతో ఎవరికి దక్కుతాయోనని ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు చైర్మన్ గిరీపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచి పచ్చకుండువా కప్పుకున్న 17వ వార్డు కౌన్సిలర్ సుభద్ర కూడా చైర్‌పర్సన్‌గా కొలువుదీరాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీళ్లిద్దరిలోనే ఎవరో ఒకరికి పీఠం దక్కడం ఖాయంగా తెలుస్తోంది. ఇక వైస్ చైర్మన్ పదవిని వైఎస్సార్ సీపీ హయాంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రామచంద్రారెడ్డికి ఇచ్చారు. నగర పంచాయతీలో వాల్మీకి సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నందున ఈసారి కూడా వాల్మీకి వర్గానికి చెందిన వారికే వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టాలని పలువురు కోరుతున్నారు. అయితే టీడీపీ నేతలు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లకు ప్రాధాన్యం ఇస్తారా... లేదా అన్నది బుధవారం తేలనుంది.

భారీ పోలీస్ బందోబస్తు

ఎన్నికల సందర్భంగా మడకశిర నగర పంచాయతీ కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు మడకశిర పట్టణ సీఐ నగేష్ తెలిపారు. కౌన్సిలర్లను మాత్రమే లోనికి అనుమతిస్తామని ఇతరులకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

బొలెరో ఢీ - వ్యక్తి మృతి


మృతుడు గంగన్న

కదిరి అర్బన్: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరిలోని అడపాలవీధికి చెందిన గంగన్న (50) స్థానిక మదనపల్లి మార్గంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మిస్టర్ టీ షాపు ఎదురుగా రోడ్డుకు పక్కగా తన ద్విచక్ర వాహనాన్ని ఆపి కూర్చుని ఉండగా కదిరి నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో కుటాగుళ్ల వద్ద మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చేనేత కార్మికుడి బలవన్మరణం


ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన మల్లప్ప(55) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ప్రమీల, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం సాయంత్రం పోతుకుంట ఆర్‌ఓబీ వద్దకు చేరుకున్న రైలు కింద పడి చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమెన్ సమాచారంతో జీఆర్పీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మల్లప్ప ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

'ఫార్మర్ చాట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి'


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: పంటల సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు సెర్ప్‌తో కలసి డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సంస్థ రూపొందించిన ఫార్మర్ చాట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు గ్రీన్ ట్రస్ట్ ప్రతినిధి శ్రీకాంత్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పిలుపునిచ్చారు. ఫార్మర్ చాట్ యాప్ ఉపయోగాలపై డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వ్యవసాయ సమాచారం, మార్కెట్ లింకేజీలు, రైతుల మధ్య పరస్పర విజ్ఞానం మార్పిడికి ఈ యాప్ దోహదపడుతుందన్నారు. ఈ నెల 17న అన్ని మండలాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి యాప్ వినియోగంపై చైతన్య పరచనున్నామన్నారు. అనంతరం యాప్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డీపీఎం రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వారి వంచన



కదిరి: చంద్రబాబుతో జత కట్టిన పవన్ కళ్యాణ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్ని వర్గాల ప్రజలపై హామీల వర్షం కురిపించారు. ఆ వర్షంలో తడిసి ముద్దయిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారు. 'మాకు అధికారం ఇచ్చి చూడండి. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తాం. పెండింగ్ బకాయిలన్నింటినీ ఒకేసారి చెల్లిస్తాం. సకాలంలో జీతాలు, పెన్షన్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను అందించే ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరిగే పని లేకుండా చేస్తాం. ఉద్యోగులకు పని భారం తగ్గిస్తాం' అంటూ ఇలా ఎన్నో అలవిగాని హామీలతో చంద్రబాబు ఉద్యోగులకు ఒక బహిరంగ లేఖ కూడా రాశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు కూటమి సర్కారుపై కోపం వస్తోంది. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమాలకు సిద్ధం అంటూ వారు కూటమి సర్కారుకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపు?

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారీ తమ సమస్యలపై ఏమైనా చర్చిస్తారేమోనని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏడాదిగా ఎంతో ఆశగా ఎదురు చూస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా ఈ జూలైతో ఆ సంఖ్య నాలుగుకు చేరింది. అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదీ లేదు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్ రాజీనామా చేస్తే ఆ స్థానంలో ఇప్పటి వరకూ కొత్త కమిషన్‌ను నియమించలేదు. కొత్త పీఆర్సీ వస్తే జీతాలు పెంచాల్సి వస్తుందని సాగదీస్తూ వస్తున్నారని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

ఓపీఎస్‌పై నోరు మెదపని సర్కారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను తీసుకొస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉద్యోగులకు మాటిచ్చారు. ఏడాది కాలంలో ఏనాడూ ఈ అంశంపై నోరు మెదపలేదు. ఈ విషయంలోనూ కూటమి సర్కారు ఉద్యోగులను వెన్నుపోటు పొడిచింది. ఉద్యోగులెవరైనా తమ న్యాయమైన డిమాండ్‌లపై ప్రశ్నిస్తే తోకలు కత్తిరిస్తా.. అని సీఎం చంద్రబాబు బెదిరింపులకు దిగుతున్నారు. గత జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ మంజూరు చేసిన విషయాన్ని పలు ఉద్యోగ సంఘాల నాయకులు ఇప్పుడు గుర్తు చేస్తున్నారు.

క్రమబద్ధీకరణ లేనట్లేనా?

తాము అధికారంలోకి రాగానే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మందికి పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని అంచనా. వీరిలో 15 ఏళ్లకు పైబడి విధులు నిర్వర్తిస్తున్న వారు కూడా ఉన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో ఏనాడూ కూటమి ప్రభుత్వం వీరికిచ్చిన హామీపై చర్చించిన దాఖలాలు లేవు. వీరు కూడా ఆందోళన బాట పట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

తక్షణం ఐఆర్ ఇవ్వాలి



మధ్యంతర భృతి కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఐఆర్ ఇవ్వాలి. అలాగే సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని సమీక్షించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలి.

– కాడిశెట్టి శ్రీనివాసులు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యమ బాట తప్పదు



ఏటా జనవరి, జూలై మాసాల్లో అంటే ప్రతి ఆరు నెలలకోసారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం ప్రకటిస్తోంది. దానిని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం డీఏలు ఇవ్వాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. ఈ జూలై మాసంతో పెండింగ్‌లో నాలుగు డీఏలు వెంటనే ఇవ్వకపోతే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుంది.

– జి.హరిప్రసాదరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఒక్క హామీ నెరవేర్చలేదు



కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు 9 హామీలిచ్చింది. కానీ ఇప్పటి వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మెరుగైన పీఆర్సీ అన్నారు. ఇంత వరకూ ఆ ఊసే లేదు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కార్పొరేషన్ అన్నారు. అదీ లేదు. ఐఆర్ లేదు. డీఏలు లేవు.

– ఆత్మారెడ్డి, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

కృష్ణా జలాలతో చెరువులు నింపండి

- జలసాధన సమితి సభ్యుల డిమాండ్


హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ స్వరూప్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

హిందూపురం: కృష్ణా జలాలతో హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని చెరువులనూ నింపాలని ప్రభుత్వాన్ని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఎస్ఈ స్వరూప్‌కుమార్‌ను మంగళవారం కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 265 చెరువులను నింపాల్సి ఉండగా మొక్కుబడిగా కేవలం 35 నుంచి 40 చెరువులకు మాత్రమే నీరు వదులుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి వదిలిన నీరు పెనుకొండ నియోజకవర్గంలోని 19 చెరువులు, హిందూపురం ప్రాంతంలోని నాలుగు చెరువులకు మాత్రమే చేరుకున్నాయన్నారు. మడకశిర ప్రాంతానికి నీరు అందలేదన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తొలి ప్రాధాన్యతగా హిందూపురం, మడకశిర ప్రాంతాల చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు, న్యాయవాది రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, టీపీడీఆర్ నాయకులు ప్రకాష్, పీడీఎస్‌యూ, జలసాధన సమితి నాయకులు వీరేంద్ర, వీరనారప్ప, తిప్పేస్వామి, కేఎన్‌పీఎస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భారంతో చేనేత కార్మికుడి బలవన్మరణం

పెనుకొండ రూరల్: అప్పుల భారంతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పెనుకొండ మండలం హనుమపల్లికి కురుబ గంగాధర్ (37)కు భార్య భువనేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమందేపల్లిలో నివాసముంటూ చేనేత కూలీగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో పీర్ల పండుగ కోసమని కుటుంబసభ్యులతో కలసి స్వగ్రామానికి వచ్చిన ఆయన మంగళవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అధికారుల తప్పిదం.. నిరుపేదకు శాపం

- తాత మరణిస్తే రేషన్ కార్డులో మనవడి పేరు తొలగింపు
- ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో బాధితుడి ఆవేదన


ప్రభుత్వ కార్యాలయాల్లో ఇచ్చిన అర్జీలు చూపుతున్న సాయిపూజిత్, తల్లిదండ్రులు

పుట్టపర్తి టౌన్: అధికారుల తప్పిదం ఓ నిరుపేద కుటుంబానికి శాపంగా మారింది. ఆరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా తప్పిదాన్ని సరిదిద్దుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక ఓ విద్యార్థి చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. వివరాలు.. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఎనుములపల్లి గ్రామానికి చెందిన మంగలి గంగాధర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కుల వృత్తితో గంగాధర్, కూలి పనులతో భార్య.. కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం గంగాధర్ తండ్రి మరణించాడు. ఆ సమయంలో రేషన్ కార్డు నుంచి మృతుడి పేరును తొలగించాల్సిన అధికారులు పొరపాటున మనవడు సాయిపూజిత పేరును తొలగించారు. రికార్డుల్లోనూ సాయిపూజిత్ మరణించినట్లుగా నమోదైంది. ఈ పొరపాటును గుర్తించిన గంగాధర్ ఆరేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం సాయిపూజిత్ పదో తరగతి చదువుతున్నాడు. ఆపై ఉన్నత చదువులు చెప్పించడం తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతకు మించింది కావడంతో ఇప్పటి నుంచే ఆ కుటుంబంలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఆరేళ్లుగా సాయిపూజిత్‌కు సంబంధించి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రికార్డుల్లో తన కుమారుడిని బతికించాలని వేడుకుంటున్నారు.

జెడ్పీ సీఈఓను కలిసిన ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు


సీఈఓ శివశంకర్‌కు కార్యవర్గ ఏర్పాటు ప్రతిని అందిస్తున్న ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్‌ను ఎంపీడీఓల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రతినిధులు మంగళవారం కలిశారు. తమ సంఘం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిని అందజేసి, మాట్లాడారు. విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లు, పదోన్నతులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను కూడా కలిసి తమ సమస్యలపై చర్చించారు.

ఎంపీడీఓల కార్యవర్గం ఏర్పాటు

ఎంపీడీఓల సంఘం శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని అనంతపురంలోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేంద్రకుమార్ (గోరంట్ల), ఉపాధ్యక్షుడిగా సాయి మనోహర్ (ధర్మవరం), ప్రధాన కార్యదర్శిగా నరేష్‌కృష్ణ (పెనుకొండ), సహాయ కార్యదర్శిగా నసీమ (తలుపుల), కోశాధికారిగా రఘునాథగుప్తా (నల్లచెరువు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రామారావు (అమరాపురం), శ్రీనివాసులు (బుక్కపట్నం), బాలకృష్ణుడు (చెన్నేకొత్తపల్లి) ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీలో చోటు

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలకు చోటు కల్పిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఎస్.అంజినప్పను ఎస్సీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా, సి.నరసింహులును ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో జూన్‌లో నిర్వహించిన బీటెక్ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు, ఒకటో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–23), (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్‌నాయుడు మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జి.రాజు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- వేలాడుతున్న తీగలు తగిలి బాలునికి షాక్
- కాలు, చేయి తొలగించిన వైనం
- బాధిత కుటుంబం ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు


విద్యుత్ షాక్‌కు గురైన షేక్ హస్ను

కదిరి టౌన్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ చిన్నారి ప్రాణాల మీదకు తెచ్చింది. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైన చిన్నారికి కాలు, చేయి తొలగించాల్సి వచ్చింది. బాధిత కుటుంబం ఫిర్యాదుతో విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్‌తో పాటు ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు. వివరాలిలా... కదిరి మున్సిపల్ పరిధిలోని రామిరెడ్డి కాలనీలో శ్రీనివాసులు అపార్ట్ మెంట్‌కు అనుసంధానం చేసిన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో పలుమార్లు స్థానికులు ఏఈ శ్రీనివాసులనాయక్‌తో పాటు యజమానికి అక్కడే నివాసముంటున్న షేక్ షాజహాన్ ఫిర్యాదు చేశాడు. అయినా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో గత నెల 26న షాజహాన్ కుమారుడు హస్ను క్రికెట్ ఆడుతూ బాల్ కోసం కంచె ఎక్కుతుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో హస్నుకు కాలు, చెయ్యి తొలగించాల్సి వచ్చింది. ఇందుకు కారణం ఏఈ శ్రీనివాసులనాయక్, అపార్ట్ మెంట్ యజమాని శ్రీనివాసులు, ఆ ప్రాంత లైన్‌మెన్ నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత షాజహాన్ చేసిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

గాండ్లపెంట: ఈ నెల 7న కురుమామిడికి చెందిన ఉపాధి క్షేత్ర సహాయకుడు మనోహర్, అతని మామ దాదెప్ప దాడి చేయడంతో ఉపాధి కూలీ రంగారెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం రెక్కమాను గ్రామంలో ఆర్డీటీ కార్యాలయం వద్ద తచ్చాడుతున్న మనోహర్, దాదెప్పను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ నాగేంద్ర తెలిపారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జవాన్ అంత్యక్రియలు పూర్తి


మురళి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కనగానపల్లి: ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ మురళి అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామం శివపురం కొట్టాలలో సైనిక లాంఛనాలతో పూర్తి చేశారు. మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు సోమవారం రాత్రి రాయపూర్ నుంచి బెంగుళూరు మీదుగా శివపురం కొట్టాలకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూడగానే కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు బోరున విలపించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సీఆర్‌పీఎఫ్ అధికారులు శ్యామ్‌సుందర్, శ్రీరాములు, ఇతర సిబ్బంది సైనిక లాంఛనాలు నిర్వహించారు. ప్రభుత్వం తరపున తక్షణ సాయం కింద రూ.75 వేలను బాధిత కుటుంబసభ్యులు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పలువురు ప్రజాప్రతినిధుల నివాళి

మంగళవారం ఉదయం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు శివపురం కొట్టాలకు చేరుకుని మురళి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిపై కేసు నమోదు

బత్తలపల్లి: సీఎం చంద్రబాబు ఫొటోకు అనుచిత వ్యాఖ్యలు జోడించి సెల్‌ఫోన్ స్టేటస్‌లో పెట్టుకున్నాడంటూ టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బండి క్రిష్టప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిరక్షరాస్యుడైన క్రిష్టప్ప పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలిసి, అదే అనుకుని సీఎం చంద్రబాబు ఫొటోను శ్రద్ధాంజలితో కూడిన ఫొటోగా తన వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. బత్తలపల్లి టీడీపీ నాయకుడు కాకర్ల సురేంద్రనాయుడుతో పాటు మండల టీడీపీ నాయకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రిష్టప్పపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇది పొరపాటుగా జరిగిందని పోలీసులకు వివరణ ఇచ్చుకున్నాడు.

రూ.4.86 లక్షల విలువైన ఎరువుల సీజ్


ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం: స్థానిక బాలాజీ ట్రేడర్స్‌లో ఎరువుల నిల్వల్లో తేడాలు ఉండడంతో రూ.4,86,219 విలువైన 16.535 మెట్రిక్ టన్నుల ఎరువులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ఈ తనిఖీల్లో పుంగనూరు ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ సీఐ శివన్న, హిందూపురం ఏడీఏ అల్తాఫ్ అలీ, వ్యవసాయాధికారులు ప్రసాద్, సురేంద్రనాయక్ పాల్గొన్నారు. బాలాజీ ట్రేడర్స్‌తో పాటు శ్రీబృందావన ట్రేడర్స్‌లో తనిఖీలు చేపట్టారు.

విధుల్లోకి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


పీఏబీఆర్‌లో మోటర్ స్విచ్ ఆన్ చేస్తున్న కార్మికులు

కూడేరు: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మె విరమించి మంగళవారం విధుల్లోకి చేరారు. పీఏబీఆర్‌లోని శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌లో మోటర్ స్విచ్ ఆన్ చేసి తాగునీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్ చెల్లించాలంటూ కార్మికులు సాగించిన 100 రోజుల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కాంట్రాక్టర్ శివారెడ్డి తమతో జరిపిన చర్చల్లో బుధవారం సాయంత్రంలోపు కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి వేతనలు, పీఎఫ్ జమవుతాయని హామీనిచ్చారన్నారు. ఇందుకు కార్మికులు సమ్మతించి విధుల్లోకి చేరారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, ప్రాజెక్ట్ యూనియన్ నేతలు ఎర్రిస్వామి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, నాగరాజు, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరు వాహనాల సీజ్


ఇసుకను తవ్వుతున్న హిటాచీని స్వాధీనం చేసుకుంటున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్/బత్తలపల్లి: ధర్మవరం డివిజన్ పరిధిలోని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో మంగళవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న పలు వాహనాలను ఆర్డీఓ మహేష్ స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. మూడు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లు, ఓ జేసీబీ వాహనాన్ని సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఈ సందర్భంగా ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను ఏమార్చి బంగారు గొలుసు చోరీ

నల్లమాడ: మహిళను నమ్మించి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన మంగళవారం నల్లమాడలో చోటు చేసుకుంది. వివరాలు.. రాగానిపల్లికి చెందిన రైతు సుధాకర్‌రెడ్డి నల్లమాడ–పుట్టపర్తి రహదారి ప్రక్కన శ్రీబాలాజీ స్కూల్ ఎదురుగా ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పనిపై మంగళవారం ఆయన బయటకు వెళ్లిన సమయంలో భార్య రామాంజులమ్మ షాపులో ఉంది. సాయంత్రం 4.10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు రూ.100లు ఇచ్చి గమ్ బాటిల్ కొనుగోలు చేశారు. ఓ యువకుడు ఆమెతో మాటలు కలిపి, 'మీ మెడలోని బంగారు చైన్ మోడల్ చాలా బాగుంది అక్కా, నా భార్యకు కూడా ఇలాంటిది చేయించాలి అనుకుంటున్నా, ఓ ఫొటో తీసుకుంటా' అంటూ చైన్ ఆమె మెడలో ఉండగానే ఫొటో తీసుకున్నాడు. అయితే ఫొటో సరిగా రాలేదని, ఒకసారి చైన్ తీసి ఇస్తే ఫొటో తీసుకుంటానని నమ్మబలికాడు. దీంతో రామాంజులమ్మ మెడ నుంచి రెండు తులాల బంగారు చైన్ తీసి పేపర్‌లో పెట్టి యువకుని చేతికిచ్చింది. ఆమె చిల్లర కోసం పెట్టెలో వెదుకుతుండగా చైన్ తీసుకొని ద్విచక్ర వాహనం ఎక్కి ఉడాయించారు.

కాటమయ్యస్వామి ఊరేగింపు


గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు, యర్రాయపల్లి, అనంతసాగరం, లింగారెడ్డిపల్లి, రాఘవంపల్లి గ్రామాలలో కాటికోటేశ్వరుడు (ఈదుల ముష్టూరు కాటమయ్యస్వామి) మూలవిరాట్‌ను ఊరేగించారు. తొలుత ఈదుల ముష్టూరులో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా యర్రాయపల్లికి భజనలు చేస్తూ తీసుకెళ్లారు. అక్కడ నుంచి అనంతసాగరం, లింగారెడ్డిపల్లి, రాఘవంపల్లిలోనూ భజన బృందాలు స్వాగతం పలుకుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బొడ్రాయిలకు, ఆలయాలకు వెళ్లి నారికేళాలను సమర్పించారు.